క్లుప్తంగా

ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు

తాళ్లరేవు: ప్రముఖ ఆలయాల్లో కేశఖండన విభాగంలో పనిచేస్తున్న నాయీ బ్రాహ్మణులను ఎండోమెంట్ ఉద్యోగులుగా గుర్తిస్తూ క్యాబినెట్‌లో ఆమోదం తెలిపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి నాయీ బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కాపవరపు శ్రీదేవి బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణులకు ఇచ్చిన మాటను సీఎం జగన్ నిలుపుకున్నారని, ఆయనకు తమ సంఘ సభ్యులు జీవితాంతం రుణపడి ఉంటారన్నారు.

నేడు హుండీ లెక్కింపు

ఐ.పోలవరం: ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ పెన్మత్స వాసురాజు, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణలు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అమలాపురం దేవస్థాన తనిఖీ అధికారి, పాలక మండలి సభ్యులు, గ్రామస్తుల సమక్షంలో హుండీ లెక్కింపు జరుగుతుందన్నారు.

కవయిత్రికి అభినందనలు

ఐ.పోలవరం: మురమళ్ల గ్రామానికి చెందిన ఉపాధ్యాయిని, వర్ధమాన కవయిత్రి దొండపాటి నాగజ్యోతి శేఖర్‌కు పలువురు అభినందనలు తెలిపారు. ఆమె రచించిన 'రెప్పవాల్చని స్వప్నం' కవితా సంపుటికి ద్రవిడ విశ్వవిద్యాలయ మాజీ ఉపకులపతి ఆచార్య గంగిశెట్టి లక్ష్మీనారాయణ అందజేస్తున్న ప్రతిష్టాత్మక మాతృశ్రీ స్మారక ఉత్తమ కవితా సంపుటి పురస్కారం లభించింది. ఈ పురస్కారం కింద రూ.10 వేల నగదు, పురస్కారాన్ని ఈ నెల 14న పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయంలో ఆమెకు అందజేశారు. ఈ సందర్భంగా ఆమెను పీటీఎం సంస్థ వ్యవస్థాపకుడు పి.వెంకటేశ్వరావు, వీధి సురేష్ బాబు, రాజశేఖర్ బాబు తదితరులు అభినందించారు.

క్రమం తప్పకుండా వాటర్ ట్యాంకులను శుభ్రం చేయాలి

అల్లవరం: మండలంలోని వివిధ గ్రామాల ప్రజలకు రక్షిత మంచినీటిని అందించే ఓవర్ హెడ్ ట్యాంకులను క్రమం తప్పకుండా ప్రతి 15 రోజులకోసారి శుభ్రం చేయాలని ఎంపీడీఓ జి.సరోవరరావు తెలిపారు. అల్లవరంలో 150 ఏఎల్ సామర్థ్యం గల ఓహెచ్‌ఆర్ ట్యాంకుని బుధవారం ఆయన పరిశీలించారు. ఓహెచ్‌ఆర్ ట్యాంకుల శుభ్రతపై కార్యదర్శుల నిఘా ఉండాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి రాజమోహన్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా కోదండ రామాలయం ప్రతిష్ఠ

కాట్రేనికోన: నడవపల్లి గ్రామంలో సీతారామలక్ష్మణ సమేత కోదండరాముని ఆలయ, శిఖర, విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. వేద పండితుల పర్యవేక్షణలో గణపతిహోమం, సుదర్శన హోమం, సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవం, సీతారామ కల్యాణం నిర్వహించారు. అనంతరం భక్తులకు సామూహిక అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో భూపతిరాజు సుబ్రమణ్యంరాజు, నడింపల్లి సూరిబాబు, ఎ.శ్రీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత

అమలాపురం రూరల్: పేరూరు కొంకాపల్లి గ్రామంలో షేక్ అంషాద్ బాషా ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతడి భార్య నాగలక్ష్మికి వైఎస్సార్ బీమా తక్షణ సాయంగా రూ.10 వేల రూపాయలను సర్పంచ్ దాసరి అరుణ బుధవారం అందజేశారు. మిగతా సొమ్మును నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేస్తారని సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సుధా గణపతి, సత్తిబాబు, బుజ్జి, వీరబాబు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులు నింపకుండా నిర్లక్ష్యం

యానాం: యానాం నియోజకవర్గానికి తాగునీటి అవసరాలను తీర్చే కీలకమైన 55 ఎకరాల చెరువులను నింపకుండా సంబంధిత పీడబ్ల్యూడీ అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని పంది సిద్దార్థకుమార్, మాగాపు సుబ్బారావు తదితర నాయకులు ఆర్‌ఏఓ మునిస్వామిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలం వచ్చినా స్థానిక ప్రజాప్రతినిధికి చెడ్డపేరు రావాలనే ఉద్దేశంతో కావాలనే చెరువులను నింపడం లేదని మాగాపు సుబ్బారావు పేర్కొన్నారు. సంబంధిత పీడబ్ల్యూడీ ఇంజినీర్ భాస్కర్‌ను విధుల్లోంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నక్కల సుబ్బన్న, పెట్టా హరిబాబు, అరుణ్ కుమార్, లోకేశ్వరరావు, సబ్బతి శ్రీను, నల్లం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

గడువు పెంపు రద్దు చేయాలి

యానాం: యానాం కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడు, పాలకవర్గ కమిటీ గడువు ఈ నెల 31తో ముగుస్తున్నా మరో 3 నెలల పాటు పెంచుతూ పుదుచ్చేరి కోపరేటివ్ డైరెక్టర్ బుధవారం జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ బుధవారం ఆర్‌ఏఓ మునిస్వామికి కమిటీలోని పలువురు డైరెక్టర్లు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడుతూ కోపరేటివ్ స్టోర్స్ అధ్యక్షుడిగా పి.విఘ్నేశ్వరుడు ఎన్నిక సరైంది కాదని తాము అనేకసార్లు ఫిర్యాదు చేశామన్నారు. కోపరేటివ్ లావాదేవీల్లో అనేక అవకతవకలు చోటు చేసుకున్నాయన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు మట్టపర్తి మంగ, నల్లా నాగలక్ష్మి, సుబ్బలక్ష్మి, బేగం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు ప్రారంభం

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణ, రూరల్ మండల ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన ఏడు పరీక్షా కేంద్రాల్లో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు బుధవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. అవే కేంద్రాల్లో ఇంటర్మీడియట్ విద్యార్థులతో పాటు ఒకేషనల్ కోర్సుల విద్యార్థులూ పరీక్ష రాశారు. ఈ ఏడు కేంద్రాల్లో మొత్తం 2120 మంది విద్యార్థులు పరీక్ష రాసినట్లుగా అధికారులు తెలిపారు. అమలాపురం ఎస్‌కేబీఆర్ కళాశాల, ఆదిత్య, విద్యానిధి, ఏఎస్ఎన్, మిరియాం తదితర కళాశాలల్లో ఈ పరీక్షలు జరిగాయి.

నిర్ణీత సమయానికి ముందే విద్యార్థుల రాక

అమలాపురం పరిధిలోని 7 పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు తమ తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల సహకారంతో నిర్దేశిత సమయం కంటే ముందే చేరుకున్నారు. కేంద్రాల వద్ద ఏర్పాటుచేసిన నోటీసు బోర్డుల్లో తమ పేర్లను ఆతృతగా చూసుకుని పరీక్ష రాయాల్సిన గదులకు వెళ్లారు. జాయింట్ కలెక్టర్ ధ్యానచంద్ర, డీవీఈవో సత్యనారాయణరెడ్డి, ఆర్డీవో వసంతరాయుడు, ఆయా మండలాల తహసీల్దార్లు అమలాపురం, ముమ్మిడివరం నియోజకవర్గాల్లోని పరీక్షా కేంద్రాలను సందర్శించి తనిఖీలు చేశారు.



అమలాపురం విద్యానిధి కళాశాల పరీక్షా కేంద్రం వద్ద నోటీసు బోర్డులో తమ పేర్లను చూసుకుంటున్న విద్యార్థులు

పరీక్ష రాస్తూ అపస్మారక స్థితికి...

విద్యానిధి కళాశాలలో పరీక్ష రాస్తున్న డి.లహరి అనే విద్యార్థిని పరీక్ష రాస్తూ ఉన్నపళంగా అస్వస్థతకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. కళాశాల వద్ద సిద్ధంగా ఉన్న ఏఎన్ఎంలు ఆమెకు ప్రాథమిక చికిత్స చేశారు. అయినా విద్యార్థిని పరిస్థితి ఆందోళనకరంగానే ఉండడంతో అత్యవసర వైద్యం కోసం ఆమెను 108 అంబులెన్స్‌పై స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొంది కోలుకోవడంతో బుధవారం సాయంత్రం ఆమెను వైద్యులు డిశ్చార్జి చేసి ఇంటికి పంపించారు.



ముమ్మిడివరం ఎంజీఆర్ కళాశాలలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

విద్యార్థిని పరీక్ష రాసేందుకు ఉదయం ఉరుకులు, పరుగులతో పరీక్షా కేంద్రానికి రావడంతో కొంత మానసిక ఒత్తిడికి గురవ్వడంతో పాటు ఉదయం ఎలాంటి అల్పాహారం తీసుకోకపోవడం వల్ల ఆమె అస్వస్థతకు గురైనట్లుగా వైద్యులు తెలిపారు.

పరీక్షలు ప్రశాంతం

ముమ్మిడివరం: ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పరీక్షలు ముమ్మిడివరంలో బుధవారం ప్రశాంతంగా జరిగాయి. డాక్టర్ మెకా గణపతిరావు ప్రభుత్వ జూనియర్ కళాశాల, తారా జూనియర్ కళాశాల, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో మొత్తం 883 మంది విద్యార్థులకు గాను 825 మంది విద్యార్థులు పరీక్ష రాశారు. 58 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. ఎంజీఆర్ ప్రభుత్వ కళాశాలలో 344 మందికి 316 మంది, తారా జూనియర్ కళాశాలలో 255 మందికి 237 మంది, గురుకుల పాఠశాలలో 284 మందికి 272 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ కె.సురేష్‌బాబు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఎండిపోయిన పొలాలను పరిశీలించిన అధికారులు

అమలాపురం రూరల్: నల్లమిల్లి, జనుపల్లి, నడిపూడి రావులచెరువు గ్రామాల్లో సాగునీటి ఎద్దడి కారణంగా ఎండిపోయిన వరి పొలాలను ఏవో కడలి ధర్మప్రసాద్, నీటిపారుదలశాఖ అధికారి నాగప్రసాద్, ఏఈవో శ్రీనివాస్‌లు పరిశీలించారు. ఎకరానికి రూ.25 వేల పెట్టుబడి పెట్టామని, సాగు నీరు లేక పొలాలు బీటలు వారిపోతున్నాయని రైతులు వాకపల్లి శ్రీనివాస్, గోకరకొండ సత్యానందం, చప్పిడి వెంకటేశ్వరరావు తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైన్ ద్వారా ఉన్న నీటిని తోడి దాళ్వా పంటను రక్షించి రైతులను కాపాడాలని రైతు నాయకుడు అప్పారి వెంకటరమణ అధికారులను కోరారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

వేసవిలో తాగునీటి సమస్యను నివారించాలి



సర్పంచ్‌లు, కార్యదర్శులతో సమావేశం నిర్వహిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి

ఉప్పలగుప్తం: మండలంలోని తాగునీటి సమస్యలు ఎదుర్కొంటున్న ప్రాంతాలను గుర్తించి నీటి సమస్యను నివారించేలా గ్రామ సర్పంచ్‌లు చర్యలు చేపట్టాలని ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సర్పంచ్‌లు, కార్యదర్శులతో ఆమె ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏటా వేసవిలో కొన్ని గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొంటుందని, అవసరమైతే ట్యాంకర్ ద్వారా తాగునీటిని సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలి

అమలాపురం టౌన్: అమలాపురం పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ కోసం మార్పు చేసిన వాహనాల స్టాపు పాయింట్ల విషయంలో పోలీసులకు సహకరించాలని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి పట్టణంలోని వ్యాపార సంఘాల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధుల బృందం బుధవారం సీఐని మర్యాద పూర్వకంగా కలిశారు. చాంబర్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో వివిధ వ్యాపార సంఘాల అధ్యక్షులు పట్టణ పోలీసు సర్కిల్ కార్యాలయంలో సీఐని అభినందించి సత్కరించారు. ఈ సందర్భంగా వ్యాపారుల నుంచి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పూర్తి సహకారం అందిస్తామని చాంబర్ అధ్యక్షుడు తాతాజీ సీఐ దుర్గా శేఖరరెడ్డికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో చాంబర్ కార్యదర్శి యెండూరి నాగేశ్వరరావు, కుప్పాల రామకృష్ణ, సప్పా నాగేశ్వరరావు, జనిపిరెడ్డి హరి, లంకలపల్లి సుబ్బారావు తదితరులు సీఐని కలిసిన వారిలో ఉన్నారు.



సీఐ దుర్గా శేఖరరెడ్డిని సత్కరిస్తున్న పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులు

ఘనంగా కాన్షీరామ్ జయంతి వేడుకలు

అమలాపురం టౌన్: బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 89వ జయంతి వేడుకలు స్థానిక గడియారం స్తంభం సెంటరులో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు సత్య చింతా ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. తొలుత కాన్షీరామ్ చిత్రపటానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఆయన సేవలను కొనియాడారు. పార్టీ జిల్లా నాయకులు కాండ్రేగుల నరసింహం, కాశి లక్ష్మీభవాని, జిల్లా ప్రధాన కార్యదర్శి కుసుమ వెంకటేశ్వరరావు, కోశాధికారి సాకా రాజారావు, కోలా త్రిమూర్తులు తదితరులు ప్రసంగించి బహుజనులకు రాజ్యాధికారం ఇవ్వాలనే దిశగా కాన్షీరామ్ జీవితాన్ని త్యాగం చేశారని పేర్కొన్నారు.

ముమ్మిడివరం: ముమ్మిడివరంలో కాన్షిరామ్ 89వ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక పోలమ్మ చెరువు బుద్ధ పార్కులో విశ్వజన కళామండలి ఆధ్వర్యంలో కాన్షీరామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ కాన్షీరామ్ బడుగు బలహీన వర్గాల హక్కుల సాధనలో నిస్వార్థంగా ప్రజా పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో కాశి బాలకృష్ణ, వడ్డి ఏడుకొండలు, పుణ్యమంతుల రజిని, మెండి కమల, తిరుకోటి శాంతిసుధ తదితరులు పాల్గొన్నారు.



కాన్షీరామ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బహుజన సమాజ్ పార్టీ నాయకులు

పాఠశాలను పరిశీలించిన సీఎంవో



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంవో సుబ్రహ్మణ్యం

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలను ఛీఫ్ మోనిటరింగ్ ఆఫీసర్(సీఎంవో) బి.సుబ్రహ్మణ్యం బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన పదోతరగతి విద్యార్థులతో మాట్లాడి వారు పరీక్షకు సిద్ధమైన తీరును పరీక్షించారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందించిన ట్యాబ్‌లను పరిశీలించి, అవి వారికి ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో అడిగి తెలుసుకున్నారు. సీఎంవో వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సత్తి సత్యకృష్ణ, ఉపాధ్యాయుడు రాయి వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ప్రోత్సాహకాలను యువత సద్వినియోగం చేసుకోవాలి

అమలాపురం రూరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందిస్తున్న వివిధ రకాల ప్రోత్సాహకాలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోనసీమ జిల్లా ఇండస్ట్రియల్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.సందీప్ అన్నారు. నెహ్రూ యువ కేంద్రం నవ భారత్ యువ నిర్మాణ సంఘ్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి నైబర్ హుడ్ యూత్ పార్లమెంట్ కార్యక్రమం భట్లపాలెంలో బీవీసీ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇండస్ట్రియల్ ప్లానింగ్ ఆఫీసర్ ఎస్.సందీప్, జిల్లా యువ సమన్వయ అధికారి పి.అమృతేశ్ మాట్లాడుతూ మేక్ ఇన్ ఇండియా, ఎంఎస్ఎంఈ సహకారంతో పరిశ్రమలను ఏ విధంగా స్థాపించాలో యువతకు వివరించారు. ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం కాకినాడ క్యాంపస్ ఇన్‌ఛార్జి అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.శ్రీరామరాజు మాట్లాడుతూ కోనసీమలో అందుబాటులో ఉన్న ఉత్పత్తుల ద్వారా ఆర్థిక అభివృద్ధి సాధించేలా ఆలోచించాలని సూచించారు. కార్యక్రమంలో బీవీసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, నవభారత్ యువ నిర్మాణ సంఘ్ అధ్యక్షుడు బొంతు ఉదయ్‌కుమార్, కుమారి నాగమణి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంసీ మదన్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో పాల్గొన్న జిల్లా ఇండస్ట్రియల్ ప్లానింగ్ ఆఫీసర్ సందీప్ తదితరులు

మహిళలు అప్రమత్తంగా ఉండాలి

ముమ్మిడివరం: సమాజంలో పిల్లల విషయంలో బాధ్యతగా వ్యవహరిస్తూ మహిళలు మరింత అప్రమత్తంగా ఉండాలని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ ఆకుల శ్రీనివాసరావు సూచించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వైఎస్సార్ క్రాంతి పథం, మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మంగళవారం తానేల్లంకలో 'నేటి సమాజం' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన శ్రీనివాసరావు మాట్లాడుతూ బాల్యవివాహాలు, స్కూల్ డ్రాపవుట్స్, మహిళా కార్మికులపై జరిగే అఘాయిత్యాలను నియంత్రించాలన్నారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో మహిళా సంఘ సభ్యులు అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది గుబ్బల భద్రావతి, అంగన్‌వాడీ టీచర్ ఎస్.సావిత్రి, వీవోఏలు సీహెచ్ నాగలక్ష్మి, జ్యోతి, సునీత తదితరులు పాల్గొన్నారు.



తానేల్లంకలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న మహిళా సంఘ సభ్యులు

బీసీలకు పోస్టుల్లో రిజర్వేషన్లు పొడిగింపు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా గ్రూప్-సి పోస్టులను గ్రూప్-బికు మార్చే విధానంలో భాగంగా వెనుకబడిన తరగతులకు కల్పించే రిజర్వేషన్లను పొడిగిస్తూ బుధవారం సాంఘిక సంక్షేమ శాఖ కార్యదర్శి డి.మోహన్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం పుదుచ్చేరిలో 27 శాతం ఉన్న ఓబీసీ రిజర్వేషన్లు 33 శాతంకు చేరాయి. ఓబీసీ-11 శాతం, బీసీ(ముస్లిం)- 2 శాతం, ఎంబీసీ-18 శాతం, ఎక్స్‌ట్రీమ్ బీసీ- 2 శాతం, బ్యాక్‌వర్డ్ ట్రైబ్స్-0.5 శాతం మొత్తం 33.5 శాతం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ మేరకు రిజర్వేషన్లను పెంచుతూ పుదుచ్చేరి స్టేట్‌లెవల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ కమిషన్ ఏకగ్రీవంగా సిఫార్సు చేసిందని తెలిపారు.

రైతులు సమన్వయం పాటించాలి

తాళ్లరేవు: గోదావరి పరీవాహక ప్రాంతంలో సాగునీటి లభ్యత కనిష్ఠ స్థాయికి చేరిన నేపథ్యంలో సాగునీటి వినియోగంలో రైతులు సమన్వయం పాటించాలని కాకినాడ ఆర్డీఓ బీవీ రమణ కోరారు. బుధవారం ఆయన మండల పరిధిలోని పి.మల్లవరం గ్రామ పంచాయతీ శివారు గ్రాంటు, పత్తిగొంది గ్రామాల్లో పర్యటించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు వంతుల వారీ విధానాన్ని అవలంబించి సమన్వయంతో ఏ విధమైన ఆటంకం లేకుండా సాగునీటిని వినియోగించుకోవాలని సూచించారు. దీనికి సంబంధించి అవసరమైన అదనపు మోటార్లు ఏర్పాటు చేయవలసిందిగా జల వనరుల శాఖ అధికారులను ఆదేశించారు. పర్యటనలో జలవనరుల శాఖ డీఈ రామకృష్ణ, తహసీల్దార్ ఎస్.పోతురాజు, ఎంపీడీఓ ఎం.అనుపమ, ఇరిగేషన్ ఏఈ ఈశ్వరరావు, ఆర్ఐ సాయితేజ రైతులు ఉన్నారు.



పత్తిగొందిలో రైతులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణ తదితరులు

వైఎస్సార్ కంటి వెలుగుతో నేత్ర సమస్యలు దూరం

తాళ్లరేవు: ప్రభుత్వం నిర్వహిస్తున్న డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమం ద్వారా ప్రజల కంటి సమస్యలు దూరమవుతాయని స్థానిక వైస్ ఎంపీపీ కొపనాతి లలిత అన్నారు. బుధవారం చినబొడ్డు వెంకటాయపాలెం గ్రామంలో కోరంగి-2 సచివాలయం పరిధిలో ఆమె కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా విద్యార్థులు, వృద్ధులకు నేత్ర పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, కళ్లజోళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. శిబిరంలో నేత్ర వైద్య నిపుణుడు ఎస్.సత్తిబాబు, ఎంఎల్‌హెచ్‌పీ కె.లక్ష్మిలు కంటి పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రామరాజు, వార్డు సభ్యులు ఎస్.శ్రీనివాస్, కాటవేణి, ఏఎన్ఎం మాధవి తదితరులు పాల్గొన్నారు.



వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

జనరల్ సర్జరీలో మెహర్ సత్తా

అమలాపురం రూరల్: కిమ్స్ కళాశాలలో వైద్య వృత్తిలో పట్టా పొందిన కాకినాడకు చెందిన అద్దంకి మెహర్ హరి జగన్మోహన్ సర్జరీ విభాగంలో డిస్టింక్షన్ సాధించి అరుదైన ఘనత సాధించాడు. ఏకంగా 75శాతం మార్కులు సాధించి కళాశాలలోనే సర్జరీ విభాగంలో టాపర్‌గా నిలిచాడు. ఓవరాల్ సబ్జెక్టుకు 65 శాతం భారీగా ఉత్తీర్ణత సాధించిన మెహర్ సర్జరీ విభాగంలో కళాశాలలోనే టాపర్‌గా నిలిచాడు. కళాశాల చైర్మన్ కేవీవీ సత్యనారాయణరాజు, ఎండీ రవికిరణ్ వర్మ, డీన్ ఆనంద్ ఆచార్య, ప్రొఫెసర్ గోలకోటి రంగారావు డాక్టర్ మెహర్‌ను అభినందించారు. మంగళవారం జరిగిన స్నాతకోత్సవంలో తల్లిదండ్రులు అద్దంకి ముక్తేశ్వరావు నాగరాణి దంపతులు సమక్షంలో మెహర్ ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాడు.



మెహర్‌కు పట్టా అందిస్తున్న డీన్ ఆనంద్ ఆచార్య

భరత్‌కు గురు బ్రహ్మ అవార్డు

అమలాపురం టౌన్: పలు పోటీ పరీక్షలు, విద్యార్థుల ప్రదర్శనలు, స్కూలు నిర్వహణ తదితర అంశాల ఆధారంగా స్థానిక వడ్డిగూడెంలోని వాగ్దేవి స్కూలును సుచిరిండియా ఫౌండేషన్ ఉత్తమ స్కూలుగా ఎంపిక చేసింది. స్కూలు డైరెక్టర్ పరసా భరత్‌ను గురుబ్రహ్మ అవార్డుకు ఎంపిక చేసింది. సుచిరిండియా ఫౌండేషన్, క్రెస్ట్, లిటిల్ చాంప్స్, నాసో సంస్థలు నిర్వహిస్తున్న పోటీ పరీక్షల్లో తమ స్కూలు విద్యార్థులు ప్రతిభ చూపిస్తున్నారని స్కూలు ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీరామచంద్రమూర్తి తెలిపారు. గురు బ్రహ్మ అవార్డుకు ఎంపికైన స్కూలు డైరెక్టర్ భరత్‌ను స్కూలులో బుధవారం సాయంత్రం జరిగిన అభినందన సభలో ప్రధానోపాధ్యాయుడు సుబ్రహ్మణం తో పాటు ఉపాధ్యాయులు ప్రశంసించి సత్కరించారు.



గురు బ్రహ్మ అవార్డుకు ఎంపికైన భరత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయ బృందం

హక్కులతోపాటు బాధ్యతలు నిర్వర్తించాలి

వినియోగదారుల అవగాహన సదస్సులో జేసీ ధ్యానచంద్ర

ముమ్మిడివరం: వినియోగదారులు తమ హక్కులతోపాటు బాధ్యతలను సజావుగా నిర్వర్తిస్తే సమస్యలు వాటికవే పరిష్కారం అవుతాయని జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యానచంద్ర తెలిపారు. ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని ముమ్మిడివరం ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాలలో కోనసీమ, కొత్తపేట కన్స్యూమర్స్ ఆర్గనైజేషన్, ఫెడరేషన్లు, జిల్లా సివిల్ సప్లయిస్ శాఖ సహకారంతో బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. ప్రతి వినియోగదారుడికి హక్కులతో పాటు బాధ్యతలు కూడా ఉంటాయన్నారు. ప్రతి వినియోగదారుడు వస్తువుల విషయంలో ధర, నాణ్యత, పరిమాణంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. సమస్యల పరిష్కారానికి ప్రభుత్వ యంత్రాంగంతో పాటు వినియోగదారుల సంక్షేమ సంఘాల సేవలు వినియోగించుకోవాలన్నారు. బాధ్యత అనేది ఇంటి నుంచే మొదలవుతుందని.. విద్యుత్ బల్బు, ఫ్యాన్ స్విచ్ఛాఫ్ చేయడం, నీటిని వినియోగించే కుళాయి నాలా కట్టడం వంటి వాటిపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఫెడరేషన్ కోరిన విధంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో కన్స్యూమర్ కమిషన్‌తోపాటు, ఎంప్లాయిమెంట్ ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయం వచ్చే విధంగా జిల్లా యంత్రాంగం ద్వారా ప్రతిపాదనలు పంపి కృషి చేస్తానని జేసీ హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా తూనికలు, కొలతల శాఖతో పాటు డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్, సివిల్ సప్లయిస్ అధికారులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను సందర్శించి వారు చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. సివిల్ సప్లయిస్ డీఎం కె.తులసి, డీఎస్‌ఓ పాపారావు, వినియోగదారులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న జేసీ ధ్యానచంద్ర

వాటర్ ట్యాంకర్ బహూకరణ

అమలాపురం టౌన్: స్థానిక సాయి సంజీవిని ఆసుపత్రి ఆధ్వర్యంలో మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజు మున్సిపాలిటీకి ఓ వాటర్ ట్యాంకర్‌ను బహూకరించారు. రూ.3 లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన ఈ ట్యాంకర్‌ను సాయి సంజీవిని ఆసుపత్రి పేరుతో రుద్రరాజు తాను ప్రాతినిథ్యం వహిస్తున్న 18వ వార్డు శివార్ల ప్రజలకు తాగునీరు అందించేవారు. ఇప్పుడు నానిరాజు ఆ ట్యాంకర్‌ను మున్సిపాలిటీకి అందించడంతో వాటర్ వర్క్స్ ఆధ్వర్యంలో పట్టణ శివార్లకు ఈ ట్యాంకర్‌తో తాగునీరు సరఫరా చేస్తున్నారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ రుద్రరాజు నానిరాజును పలువురు అభినందించారు.



నానిరాజు సమకూర్చిన వాటర్ ట్యాంకర్‌తో తాగునీటిని సరఫరా చేస్తున్న దృశ్యం

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
మొగల్లిపేట, తూర్పు గోదావరి జిల్లా
టెలిఫోన్ నం: 8374291685
సెక్షన్ 13 (2) క్రింద డిమాండ్ నోటీసు
Lr.No.560371000370111 తేదీ: 13.10.2022
[illegible]

[illegible]	లోన్ అకౌంట్ నంబర్	[illegible] (రూ.లక్షలలో)	[illegible]	[illegible]
CLUCC	560371000370111	9	10.45	రూ.9,20,000.00

[illegible]
రూ.15.40 లక్షలు
రూ.14.50 లక్షలు
[illegible]